RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 13 సంచిక : 362 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 3 జూలై 2025 | పేజీలు : 4 | వెల : 2/-

# విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యం: సీఎం రేవంత్

## బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 2: నగరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (బుధవారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యువెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గోశామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తైతే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పేలుడు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో సభ్యులుగా చీఫ్ సైంటిస్ట్ టి. ప్రతాప్‌కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, పుణెకి చెందిన భద్రతాధికారి సంతోష్ ఘుగే ఉన్నారు. పాశమైలారం ప్రమాదానికి గల కారణాలతో పాటు కర్మాగారాల భద్రతా నియమావళి పాటించారా? లేదా? అనే అంశాలను కమిటీ తెలుసుకోనుంది. ఈ ఘటనపై నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. భవిష్యత్తులో రసాయన కర్మాగారాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సహకారం అందించాలని ఆదేశించింది. మరోవైపు సిగాచి పరిశ్రమ వద్దకు మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ పరిశ్రమ ప్రతినిధులు వెళ్లారు. ఘటనాస్థలం నుంచి శిథిలాల తరలింపు ప్రారంభమైంది. ఇది ఇలా ఉండగా ప్రమాదంపై సిగాచీ పరిశ్రమ ప్రకటన విడుదల చేసింది. పేలుడు కారణంగా 40 మంది మృతి చెందినట్లు పేర్కొంది. మరో 33 మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించింది.

గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. కార్మికులకు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తామంది. క్షతగాత్రుల వైద్య ఖర్చులు భరిస్తామని.. వారి కుటుంబ పోషణ చూస్తామని పేర్కొంది. సిగాచీ తరఫున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంపై స్టాక్‌మార్కెట్లకు ఆయన లేఖ రాశారు. ఈ ఘటనకు రియాక్టర్ పేలుడు కారణం కాదని తెలిపారు. ప్రభుత్వ విచారణ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. 3 నెలల వరకు ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివేక్ కుమార్ పేర్కొన్నారు.




తాడ్వాయి: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం మహా జాతర తేదీలను పూజారుల సంఘం ప్రకటించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరగనుంది. 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు, 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. 30న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని పూజారుల సంఘం తెలిపింది. 31న అమ్మవార్ల వనప్రవేశం ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.




హైదరాబాద్ : తెలంగాణలో ఉప ఎన్నిక తప్పేలా లేదు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పార్టీలు చర్చలు మొదలు పెట్టాయి. సిట్టింగ్ సీటును బీఆర్ఎస్ కాపాడుకోవటానికి సెంటిమెంట్ అస్త్రం బయటకు తీస్తోంది. కంటోన్మెంట్ తరహాలోనే ఈ సీటులో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. అనూహ్యంగా ఈ బైపోల్ లో టీడీపీ పోటీ చేయటానికి సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. మిత్రపక్షాలు జనసేనతో పాటుగా బీజేపీతో చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థి పైనా ఒక అంచనాకు వచ్చినట్లు పార్టీ ముఖ్య నేతల సమాచారం.

**మారుతున్న లెక్కలు...** సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తో జూబ్లీ హిల్స్ బైపోల్ పైన ప్రధాన పార్టీలు చర్చలు.. లెక్కలు మొదలు పెట్టాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అక్టోబర్ నెలాఖరులో జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సెప్టెంబర్ లో షెడ్యూల్ విడుదల అవుతుందని అంచనా. కంటో న్మెంట్ సీటు తరహాలోనే జూబ్లీహిల్స్ స్థానం దక్కించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే ఈ స్థానంలో పరిస్థితుల అధ్యయనం.. నిర్ణయాల కోసం పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ తో సీఎం రేవంత్ ఒక కమిటీ ఏర్పాటు చేసారు. 2009 లో ఏర్పాటు అయిన ఈ నియోజకవర్గం నుంచి

## అభ్యర్ధిగా నందమూరి వారసురాలు..!?

మాగంటి గోపీనాథ్ మూడు సార్లు గెలిచారు. 2014 లో టీడీపీ నుంచి గెలవగా, ఆ తరువాత బీఆర్ఎస్ లోకి వెళ్లారు. 2018,2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు.

**పార్టీల కసరత్తు...** ఖైరతాబాద్ నుంచి విడిపోయి 2009 లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పాటు అయింది. 2009 లో పీ విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక, ఇప్పుడు బైపోల్ లో కాంగ్రెస్ నుంచి అజారుద్దీన్, పీజేఆర్ కుమార్తె విజయా రెడ్డి, నవీన్ యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓటింగ్ కీలకం. కాంగ్రెస్ - ఎంఐఎం మధ్య పోటీ పైన అంగీకారం కుదిరితే మొత్తం లెక్కే మారిపోవటం ఖాయంగా కనిపిస్తోంది.

అయితే, మాగంటి గోపీనాథ్ కుటుంబం నుంచే తమ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలపాలని బీఆర్ఎస్ భావిస్తోంది. సాధ్యం కాకుంటే మాజీ ఎమ్మెల్యే విష్ణుకు సీటు కేటాయించే ఛాన్స్ ఉంది. ఈ సారి అనూహ్యంగా టీడీపీ సైతం ఈ నియోజకవర్గంలో పోటీకి సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో సామాజిక సమీకరణాలు.. ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు.

**బరిలో టీడీపీ..!...** గోపీనాథ్ మరణం సమయంలో ఏపీ మంత్రి లోకేష్.. మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏపీలో సక్సెస్ అయిన ఎన్డీఏను తెలంగాణలోనూ విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. త్వర లో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి ముందు జరుగుతున్న ఈ ఎన్నికతోనే పొత్తు ప్రారంభించాలనే ఆలోచన జరుగుతోంది. దీంతో,జూబ్లీహిల్స్ బైపోల్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని బరిలో నిలపాలని భావిస్తున్నారు. అందులో భాగంగా టీడీపీ నుంచి నందమూరి సుహాసిని పేరు పరిశీలనలో ఉందని పార్టీలో ప్రచారం సాగుతోంది.టీడీపీలో సుహాసిని క్రియాశీలకంగా ఉన్నారు. నందమూరి వారసురాలిగా సీటు ఇస్తే కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు.

బీజేపీ సైతం ఇక్కడ నుంచి దీపక్ రెడ్డిని పోటీలో దింపాలని భావి స్తోంది. ప్రస్తుతం చర్చల స్థాయిలో ఉన్న ఈ ప్రతిపాదనల పైన మూడు పార్టీల అధినాయకత్వం చర్చించి.. తుది నిర్ణయం తీసుకోనుంది. ఇదే జరిగితే హైదరాబాద్ కేంద్రంగా కొత్త రాజకీయం మొదలు కానుంది.

# సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేస్తున్న భారత్..

# పాక్ గుండెలను చీల్చేలా..!




ఇటీవల ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్న అమెరికా.. శక్తివంతమైన బీ2 బాంబర్లతో ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. మాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్స్‌తో అమెరికా జరిపిన ఆకస్మిక దాడుల కారణంగా ఇరాన్‌లోని అణుస్థావరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

అత్యంత సురక్షితంగా పరిగణించే బంకర్లను సైతం ఈ బస్టర్లు నాశనం చేయగలవు. ఇరాన్‌పై అమెరికా దాడుల నేపథ్యంలో.. భారత్ కూడా కొత్త తరం బంకర్ బస్టర్ క్షిపణులను డెవలప్ చేస్తోంది. శత్రు దేశాల్లోని భూగర్భ లక్ష్యాలను ఛేధించడమే లక్ష్యంగా ఈ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం డీఆర్‌డీవో అధునాతన అగ్ని-5 బాలిస్టిక్ క్షిపణి వేరియంట్‌లో మార్పులు చేస్తున్నట్లు కథనాలు వెలుడుతున్నాయి. డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తున్న ఈ క్షిపణి 7500 కేజీల బరువైన వార్ హెడ్‌ను కలిగి ఉంటుంది. ఇది భూగర్భంలో 100 మీటర్ల లోతు వరక చొచ్చుకుపోయి లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. మన పొరుగున ఉన్న పాకిస్థాన్, చైనాల్లోని కమాండ సెంటర్లు, క్షిపణి నిల్వ కేంద్రాలు, ఇతర భూగర్భ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఈ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నారు.

"బంకర్ బస్టర్‌లు అంటే భూమి లోపల బాగా లోతుగా, పటిష్టంగా నిర్మించిన సైనిక బంకర్లు, కమాండ్ సెంటర్‌లు, క్షిపణి నిల్వ కేంద్రాలు, ఆయుధ నిల్వ సదుపాయాలు వంటి లక్ష్యాలను ధ్వంసం చేయడానికి రూపొందించిన ప్రత్యేక క్షిపణులు లేదా బాంబులు." డీఆర్‌డీవో రూపొందిస్తున్న అగ్ని-5 క్షిపణి పరిధి 5,000 కిలోమీటర్ల కంటే ఎక్కువే. 7,500 కిలోల బరువున్న సాంప్రదాయ వార్‌హెడ్‌ను ఈ క్షిపణి కలిగి ఉంటుంది. అయితే మరింత ఎక్కువగా పేలోడ్‌లను మోసుకెళ్లడం కోసం, కచ్చితత్వాన్ని మెరుగుపర్చడం ఈ క్షిపణి పరిధిని 2500 కిలోమీటర్లకు తగ్గించారు. అగ్ని-5 రెండు కొత్త వెర్షన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఒకటి ఉపరితల లక్ష్యాలపై గగనతలంలో పేల్చడానికి రూపొందించింది కాగా.. మరొకటి భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయేలా రూపొందించినది. ఇది అమెరికా GBU-57ను పోలి ఉంటుంది. ఈ క్షిపణి 8 టన్నుల వరకు పేలోడ్‌ను కలిగి ఉంటుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సాంప్రదాయ వార్‌హెడ్‌లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. అమెరికా తన బంకర్-బస్టర్ బాంబులను చేరవేయడానికి పెద్ద బాంబర్ విమానాలపై ఆధారపడుతుంది. అయితే భారతదేశం క్షిపణి ఆధారిత డెలివరీ వ్యవస్థను ఎంచుకోవడం గమనార్హం. దీని వల్ల దాడికయ్యే వ్యయం తక్కువ కావడం మాత్రమే కాకుండా ఆపరేషనల్ ఫ్లెక్సిబులిటీని, సర్వైవబులిటీని పెంచుతుంది. అగ్ని-5 క్షిపణులు మాక్ 8 నుంచి మాక్ 20 వేగంతో ప్రయాణిస్తాయి. అంటే గంటకు 9,878 కిలోమీటర్ల నుండి 24,700 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఇది ప్రపంచంలోని అత్యంత అధునాతన ఆయుధ వ్యవస్థలతో సమానం.

**ఏమిటీ బంకర్ బస్టర్లు?..** భూమి లోపల లోతుగా, అత్యంత పటిష్టంగా ఉన్న సైనిక బంకర్లు, కమాండ్ సెంటర్లు, క్షిపణి నిల్వ డిపోలు, ఆయుధ నిల్వ కేంద్రాల లాంటి లక్ష్యాలను రూపొందించిన ప్రత్యేకమైన మిస్సైళు లేదా బాంబులను బంకర్ బస్టర్‌లు అంటారు. ఇవి కాంక్రీట్ పొరలు, రాతి గోడలు, మట్టి పొరలను చీల్చుకుంటూ లోపలికి చొచ్చుకొని వెళ్లి పేలిపోతాయి. అమెరికా సైన్యం వద్ద ఉన్న అత్యంత శక్తివంతమైన బంకర్ బస్టర్ 3 వేల పౌండ్ల బరువైన మాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్ (ఎంఓపీ). ఇటీవల ఇరాన్‌లోని అణుకేంద్రాలపై ఈ ఎంఓపీలనే అమెరికా ప్రయోగించింది. మందపాటి స్టీల్ తయారు చేసిన, అధిక పేలుడు పదార్థాలతో నిండిన అమెరికా బంకర్ బస్టర్లలో డిలే ఫ్యూజులు ఉంటాయి. వీటి సాయంతో బాంబు ఎప్పుడు పేలాలో నిర్ణయించొచ్చు. ఈ పొడవైన ఫ్యూజ్.. బాంబు పేలడానికి ముందు మరింత లోతుగా చొచ్చుకెళ్లడానికి వీలు కల్పిస్తుంది. దీని వల్ల ఉపరితలానికి లోపల ఉన్న లక్ష్యాలను నాశనం చేసే సామర్థ్యం పెరుగుతుంది.

ఈ బాంబులను అభివృద్ధి చేయడానికి అమెరికా విస్తృతంగా పరీక్షలు నిర్వహించింది. అమెరికా బలగాలు మాక్ అండర్‌గ్రౌండ్ ఫెసిలిటీస్‌పై వందలాది పరీక్షలు చేపట్టాయి. టన్నెల్స్ గుండా ప్రయాణించి.. భూమి ఉపరితలం కిందనున్న కీలక పరికరాలను సమర్థవంతంగా నాశనం చేసే సామర్థ్యాన్ని కలిగి ఆశించిన స్థాయిలో లబ్ధి పొందే వరకు అమెరికా ప్రయోగాలు నిర్వహించింది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మిస్సింగ్.. కలకలం..

## చైనాలో ఏం జరుగుతోంది?

ప్రపంచ రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఇటీవల అదృశ్యం కావడం తీవ్ర చర్చకు దారితీసింది. మే 21 నుండి జూన్ 5 వరకు ఆయన బహిరంగ కార్యక్రమాల్లో కనిపించకపోవడం అనేక ఊహాగానాలకు తావిచ్చింది. శక్తివంతమైన కమ్యూనిస్టు దేశమైన చైనాలో, ముఖ్యంగా షీ లాంటి అగ్రనేత గైర్హాజరైతే, దానిని సాధారణ అంశంగా చూడలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**జిన్‌పింగ్ గైర్హాజరీపై ఊహాగానాలు...** ఇటీవలి కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీసీపీ) లోనూ, అంతర్జాతీయంగానూ జిన్‌పింగ్ పాలనపై అసంతృప్తి పెరుగుతోంది. ఆర్థిక మందగమనం, చైనా టెక్ కంపెనీలపై నియంత్రణలు, వివాదాస్పద యుద్ధ వ్యూహాలు వంటి అంశాలు ఆయన నాయకత్వంపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ అకస్మాత్తుగా కనిపించకపోవడం కొందరు పరిశీలకులు అధికార మార్పునకు సంకేతంగా చూస్తున్నారు.

**అధ్యక్ష మార్పు చర్చలోకి....** అధ్యక్ష పదవి రేసులో వాంగ్ యాంగ్ అనే టెక్నోక్రాట్ నేత పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన ఆర్థిక సంస్కరణలకు, సాంకేతిక రంగ అభివృద్ధికి కృషి చేసిన కారణంగా అంతర్గతంగా మద్దతు పెరుగుతోందని చెబుతున్నారు. అయితే, జిన్‌పింగ్ సీసీపీపై పటిష్టమైన ఆధిపత్యాన్ని కలిగి ఉన్నందున, అధికార మార్పు అంత సులభంగా జరగదని విశ్లేషకులు అంటున్నారు. 2012లో అధికారంలోకి వచ్చిన జిన్‌పింగ్, పార్టీలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి, తనకు వ్యతిరేకంగా ఉన్న శక్తులను తొలగించడానికి అనేక కీలక మార్పులు చేశారు.

**ఇది సాధారణ విరామమా? అధికార సంకేతమా?...** చైనా వంటి రాజకీయ వ్యవస్థలో ఇలాంటి గైర్హాజరీలు వ్యూహాత్మక సమావేశాలు, ఆరోగ్య కారణాలు, లేదా ప్రత్యేక అంతర్గత ఆలోచనల వల్ల కూడా కావచ్చని కొంతమంది నిపుణులు సూచిస్తున్నారు. గతంలో హూ జింటావో, జియాంగ్ జెమిన్ వంటి నేతలు కూడా కొన్ని వారాల పాటు బహిరంగ జీవితానికి దూరంగా ఉన్న ఉదాహరణలున్నాయి. కాబట్టి, ప్రస్తుత గైర్హాజరీ నిజంగానే అధికార మార్పునకు సంకేతమా లేదా సాధారణ విరామమా అనేది స్పష్టంగా చెప్పలేం.

**అంతర్జాతీయంగా ప్రభావం ఎంతవరకు?..** షీ జిన్‌పింగ్ గైర్హాజరీపై వస్తున్న ఊహాగానాలు చైనాతో సంబంధాలున్న అనేక దేశాల్లో అలజడి సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్, దక్షిణ చైనా సముద్ర వ్యూహాలు, తైవాన్‌పై చైనా వైఖరి, అమెరికాతో వాణిజ్య పోటీ వంటి కీలక అంశాలపై జిన్‌పింగ్ నాయకత్వంలోనే నిర్ణయాలు వెలువడేవి. ఆయన హఠాత్తుగా పదవి నుండి తప్పుకుంటే, ఈ అంశాలన్నీ తిరిగి సమీక్షకు వచ్చే అవకాశం ఉంది. జిన్‌పింగ్ నాయకత్వంలో దేశభక్తి, సైనిక అభివృద్ధి, వాస్తవాధీన క్షేత్రాలపై దృష్టి పెరిగింది. ఆయన లేకపోతే ఈ విధానాల్లో మార్పులు రావొచ్చు.

**ప్రజల్లో ప్రశ్నలు.. విశ్వవ్యాప్తంగా ఆసక్తి...** చైనాలోని ప్రజలు కూడా ఈ గైర్హాజరీపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో "Where is Xi Jinping?" అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. ఇదంతా చూస్తుంటే, చైనా రాజకీయాల్లో ఏదో పెద్ద మార్పు జరుగుతోందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. షీ జిన్‌పింగ్ గైర్హాజరీపై స్పష్టత ఇప్పటి వరకు లేనప్పటికీ, ఇది సాధారణ రాజకీయ విరామమా లేక అధికార మార్పుకు సంకేతమా అనేది కాలమే చెప్పాలి. కానీ చైనా రాజకీయాల్లో జరుగుతున్న ఈ పరిణామాలు భారత్‌తో పాటు, అంతర్జాతీయ రాజకీయాలపై కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

## బెట్టింగ్ భూతానికి బానిసై కన్న తండ్రిని చంపేసిన కర్కశ తనయుడు



ప్రభాత సమాచారం: హైదరాబాద్. బెట్టింగ్ జోలికి వెళ్లొద్దని అన్నందుకు తండ్రిని దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసిన 19 ఏళ్ల కొడుకుఅడగగానే పొలాన్ని తాకట్టు పెట్టి రూ. 6 లక్షలను కొడుకు రవీందర్ కి ఇచ్చిన తండ్రి హనుమంతుఆ డబ్బంతా బెట్టింగ్ లో పోవడంతో తండ్రి మందలింపు. ఇక బెట్టింగ్ ఆడొద్దని చెప్పిన మారని తీరుకోపోద్రిక్తుడై తన తండ్రిని దారుణంగా హత్య చేసిన కొడుకుహత్య చేసి ఏమాత్రం పశ్చాత్తాప పడకుండా తనను తాను కత్తితో పొడుచుకున్నాడని బంధువులకు ఫోన్ చేసి సమాచారంసైబరాబాద్ కమిషనరేట్ గచ్చిబౌలి పీఎస్ పరిధి గోపన్ పల్లి తండాలో మంగళవారం జరిగిందీ హత్యబెట్టింగ్ మహమ్మారి బంధాలు, బంధుత్వాలు, కుటుంబాలను చిద్రం చేస్తోందియువత ఈజీ మనీకి అలవాటు పడి బెట్టింగ్ ఆడుతూ అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యలు చేసుకుంటోందిమరికొందరు బెట్టింగ్ కోసం దొంగతనాలు చేస్తుంటే.. ఇంకొందరు కన్న వాళ్లనే ఇలా కడతేర్చుతున్నారు. ఇలాంటి ఘటనలు సమాజానికి శ్రేయస్కరం కాదుఅని పలువురు అభిప్రాయం.

## బాధ్యతలు మరిచి.. అమ్యామ్యాలకు మరిగి

పెద్దపల్లి : పురపాలికల్లోని అధికారుల తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణానికి చేసే వ్యయం కంటే అవసరమైన అనుమతులు పొందడమే ప్రహసనంగా మారింది. ప్రజలు నిబంధనలు పాటించినప్పటికీ వివిధ కారణాలు చూపుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసినప్పటినుంచి.. ఇంటి నంబర్ పొందేంత వరకు వివిధ దశల్లో అవినీతిపరుల చేతులు తడపాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాది కిందట నిర్మించిన ఇంటికి.. నంబర్ కేటాయించకుండా మూడు నెలలుగా విసిగించిన అధికారులు.. అనిశాకు పట్టుబడటంతో పురపాలికల్లో వివిధ దశల్లో జరిగే అవినీతి మరోసారి తెరపైకి వచ్చింది.

**కిందిస్థాయి అధికారి నుంచి..**

పురపాలికల్లో దిగువ స్థాయి నుంచి పై స్థాయి వరకు అవినీతి పెరిగిపోయింది. ముఖ్యంగా ఉన్నతాధికారుల అవినీతితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణంలో జరిగే లోపాలను కారణంగా చూపుతూ అవినీతికి పాల్పడుతున్నారు. సెట్‌బ్యాక్‌లు, రహదారి ప్రభావిత నిర్మాణాలే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటున్నాయి. ఒక ప్రాంతంలో ఇళ్లు నిర్మిస్తే పురపాలిక అధికారులతో పాటు సంబంధిత ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. ఇలాంటి ఘటనలపై ఎన్ని ఫిర్యాదులు వెళ్లిన బుట్టదాఖలే అవుతుండడంతో ప్రజలకు ఎవరిని సంప్రదించాలో అర్థం కావడంలేదు.

**జరిగిన ఉదంతాలు**

పురపాలికల్లో నిర్మాణాల అనుమతులతోపాటు చేపట్టే అభివృద్ధి పనులకు కమీషన్లు వసూలు చేసిన వివిధ స్థాయిల అధికారులకు వాటాలుంటాయి. పనుల నిర్వహణ మొదలు, బిల్లులు చెల్లించేంత వరకు ఎవరి వాటా వారికి చెల్లించాల్సిందే. ఇందులో తేడాలొస్తే ఇబ్బందులు తప్పవు. ఇలాంటి పరిస్థితిని తప్పించుకునేందుకు గుత్తేదారులు సైతం అధికారులను ప్రసన్నం చేసుకోవడం తప్పడం లేదు.

మూడేళ్ల క్రితం రామగుండం నగరపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించిన ఆర్డీవో శంకర్‌కుమార్ ఒక గుత్తేదారుకు బిల్లు చెల్లించేందుకు కమీషన్ తీసుకుంటుండగా.. అనిశాకు చిక్కాడు. గతంలో పెద్దపల్లి పురపాలికలో పనిచేసిన ఓ ఉద్యోగి నిర్మించని ఇళ్లకు నంబర్లు కేటాయించారు. దీనిపై విచారణ జరిపి అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల మంథనిలోనూ అవినీతి ఆరోపణలు వచ్చిన ఒక ఉద్యోగిని బదిలీ చేశారు.

## ఇంటి పంట.. ఆరోగ్య వంట



సూర్యాపేట : మిద్దెసాగుపై పురపాలికల్లో ఆసక్తి చూపుతున్నారు. సూర్యాపేట పట్టణంలో 1200 పైగా మిద్దెలపై వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. రసాయనాలు అధికంగా వినియోగించి పండించిన కాయగూరలతో ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని గుర్తించిన ప్రజలు ఇంటి వద్దనే సొంతంగా సాగు చేపడ్తున్నారు. గతంలో డీఎంఎఫ్‌టీ నిధులతో పురపాలికకు యూనిట్లు మంజూరు కాగా వాటితో తమ నివాసాలపై సాగు చేపట్టారు. వీటి బాధ్యతలను మెప్మా అధికారులకు అప్పగించారు. రూ. 1500 చెల్లిస్తే సంచులు, ఎరువులు, పిచికారీ వంటి వాటిని పంపిణీ చేశారు. వీరిసాయంతో పేటవాసులు తమ ఇళ్లపై వారికి నచ్చిన రకాల కూరగాయలు పండించుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు.

**నిలిచిన రాయితీ.. సొంతంగా ఏర్పాటు**

ప్రభుత్వం మారడంతో మంజూరు రాయితీ యూనిట్ల మంజూరు నిలిచిపోయింది. కొత్తగా మిద్దెసాగు చేపట్టే వారు పుర కార్యాలయానికి తిరుగుతున్నారు. నూతనంగా గృహం నిర్మించుకునేవారు ఆసక్తి కనబరుస్తున్నారు. సొంతంగా ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలను ఖరీదు చేసి వాటిలో మట్టిని నింపుతున్నారు. జూన్ మాసం అదును కావటంతో అందులో కూరగాయల విత్తనాలు నాటుతున్నారు. కానీ వాటికి కావాల్సిన ఎరువులు దొరకక, సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయితీ యూనిట్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కాయగూరలు.. పండ్లు** పట్టణానికి చెందిన గుండు వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతులు ఇద్దరూ ఉపాధ్యాయులే. స్థానిక గణేశ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. రసాయనాలు లేని కూరగాయలు పండించాలనే లక్ష్యంతో ఇంటి మీద మిద్దె తోట సాగు చేపట్టారు. బెండ, దొండ, దోస, బీర, నేతిబీర, పొట్ల, టమాట, వంకాయ, చిక్కుడు వంటి కూరగాయలు, తోట కూర, బచ్చలి, గంగవాయిల కూర లాంటి ఆకు కూరలను డబ్బాల్లో పెంచుతున్నారు. మామిడి, సపోటా, అంజీర ద్రాక్ష, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, వాటర్ యాపిల్ ఇలా పలు రకాల పండ్లనూ పండిస్తున్నారు. వీరే కాకుండా పట్టణంలో 10 మంది వరకు ఇలాగే మిద్దె పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం**సీహెచ్ హనుమంతరెడ్డి, పుర కమిషనర్ గతంలో డీఎంఎఫ్‌టీ రాయితీ యూనిట్లు మంజూరైనట్లు సిబ్బంది చెప్పారు. వీటితో పట్టణంలో మిద్దెసాగు చేపట్టారు. ఏడాదిన్నర నుంచి నిలిచిపోయినట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు నివేదించి పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

**ఐదేళ్ల నుంచి సాగు చేస్తున్నా**

గోదాల రేణుక, గోపాలపురం, సూర్యాపేట

ఐదేళ్ల కిందట ఒక్క దొండ మొక్కతో ప్రారంభించాను. దిగుబడి బాగుండడంతో సేంద్రియ కూరగాయల కోసం మిద్దెసాగు చేపట్టాను. కొవిడ్ సమయంలో ఇంటి కూరగాయలనే తిన్నాం. తొలుత పుర అధికారులు సహకారం ఉండేది. ప్రస్తుతం ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నాం. రాయితీలను పునరుద్ధరించాలి.

**రాయితీ ఇస్తే మరింత మేలు**

కళింగరెడ్డి, మిద్దెసాగుదారు, సూర్యాపేట


రాయితీపై విత్తనాలు, ఎరువులు మంజూరు చేస్తే ఎక్కువమంది మిద్దెలపై కూరగాయల సాగు చేపడతారు. గతంలో డీఎంఎఫ్‌టీ నిధులతో రాయితీ యూనిట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఇవి రాక చాలామంది ముందుకురావటం లేదు. ఆసక్తి ఉన్నవారు సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్నారు.

## వైద్య కళాశాల ఎక్కడో?

భువనగిరి : జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్యకళాశాల శాశ్వత భవన నిర్మాణ స్థలం కేటాయింపు తేలడంలేదు. అనుబంధంగా ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదిత స్థలం ఎంపిక దస్త్రాలు శాఖల మధ్య తిరుగుతున్నాయి. తరగతులు ప్రారంభమై ఏడాది దగ్గర పడుతున్నా భవనం పనులు ఒక్క అడుగుకు కూడా ముందుకు పడటం లేదు.

**ప్రతిపాదించిన స్థలంలో మొదలుకాని సర్వే**

యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి రెవెన్యూ పరిధిలో 20 ఎకరాల స్థలం వైద్యకళాశాల, ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించారు. వైటీడీఏ ఆధీనంలోని స్థలం రెవెన్యూ శాఖ సర్వే చేసి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు అప్పగించాల్సి ఉంది. సదరు అధికారులు వైటీడీఏకు కూడా లేఖ రాశారు. నూతన భవన నిర్మాణ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు డీఎంఈ ప్రయత్నం చేస్తున్నా ముందుకుసాగడం లేదు. తుర్కపల్లి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి జూన్ 6న జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. వాటిలో నూతన వైద్యకళాశాల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయినా ఎంపిక చేసిన స్థలం అప్పగించడంలో జాప్యం చోటుచేసుకుంది. 2024-25 విద్యా సంవత్సరంలో 50 సీట్లతో వైద్యకళాశాల మంజూరు అయింది. పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ ప్రైవేట్ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అనుబంధంగా భువనగిరి జిల్లా కేంద్రాసుపత్రిని జనరల్ ఆసుపత్రిగా కొనసాగిస్తున్నారు. నూతన వైద్య కళాశాలను గత ప్రభుత్వం ఆలేరు నియోజకవర్గంలో యాదగిరిగుట్టలో నిర్మించేందుకు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అక్కడే కొనసాగించాలని నిర్ణయించింది. జిల్లా కేంద్రమైన భువనగిరి కేంద్రంగా వైద్యకళాశాల నిర్మించాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు.



మరోవైపు మొదట్లో ఎంపిక చేసిన యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్‌లోనే వైద్యకళాశాల ఏర్పాటు చేయాలని అక్కడి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**స్పష్టత కరవు**

ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు ఎంబీబీఎస్ రెండో సంవత్సరం తరగతులు ప్రారంభ సమయం వరకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే స్థలం కేటాయింపు మార్పుపై స్పష్టత లేకపోవడంతో వచ్చే ఏడాది వరకు శాశ్వత భవన నిర్మాణంపై సందిగ్ధం నెలకొంది. వైద్యకళాశాల ఏర్పాటుపై స్థానిక అధికారులు మాత్రం తమకు తెలియదని అంతా డీఎంఈ పరిధిలో జరుగుతుందని పేర్కొంటున్నారు.

## ఏళ్లు గడుస్తున్నాయ్.. కాళ్లు అ(వి)రుగుతున్నాయ్!

కాగజ్‌నగర్ : చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు నిర్మించే క్రమంలో ముంపు భూములకు పరిహారం అందించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా కొన్నిచోట్ల రైతులు పరిహారం కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగి వేసారి పోతున్నారు. దశాబ్దం గడిచి పోయినప్పటికీ రెంటికీ చెడ్డ రేవడిలా మారింది బాధిత రైతుల పరిస్థితి. పెద్ద సార్లను కలిస్తే పరిష్కారమవుతుందనే ఆశతో వెళ్లిన ఓ రైతు కాలు ఇటీవల విరిగిపోయింది. కుమురంభీం అడ, జగన్నాథపూర్ ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం అందక బాధితులు అవస్థలు పడుతున్నారు. జలయజ్ఞంలో భాగంగా ఆసిఫాబాద్ మండలం అడ సమీపంలోని పెద్దవాగుపై కుమురంభీం ప్రాజెక్టు, కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగుపై జగన్నాథపూర్ ప్రాజెక్టు నిర్మాణాలు



చేపట్టింది. కుమురంభీం జలాశయం పూర్తికాగా.. కాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కానీ కాలువ ముంపు భూముల పరిహారం పూర్తిస్థాయిలో అందలేదు. జగన్నాథపూర్ ప్రాజెక్టు రిజర్వాయర్ పనులు పూర్తి కాగా 29 కి.మీ. మట్టి కాలువ తవ్వకాలతోపాటు 15 కి.మీ. లైనింగ్ పనులు పూర్తయ్యాయి. అయితే ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు కానందున 2019లో గుత్తేదారు పనులు నిలిపేశారు. కాలువ ముంపునకు గురైన 101 ఎకరాల రైతులకు ఇప్పటి వరకు (19 ఏళ్లుగా) పరిహారం అందలేదు.

ఈ విషయంపై డీఈఈ రమణను సంప్రదించగా.. ముంపు భూముల పరిహారం చెల్లింపు ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. ఆర్థికశాఖ ఆమోదం రావాల్సి ఉందని చెప్పారు.

**రెండు విధాలుగా నష్టపోయా**

1.50 ఎకరాలు జగన్నాథపూర్ ప్రాజెక్టు కాలువలో ముంపునకు గురైంది. 19 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నా. ఓవైపు పరిహారం రాక మరోవైపు సాగు భూమి కోల్పోయి రెండు విధాలుగా నష్టపోయా. ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. బాధితులకు పరిహారం చెల్లిస్తారా లేదా అనే విషయం తెలియడం లేదు. అధికారులు స్పందించి అందించేలా చర్యలు తీసుకోవాలి.

శ్యాంరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బోడెపల్లి

**కలెక్టరేట్‌కు వెళ్తే కాలు విరిగింది**

అడ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భాగంగా నజ్రుల్‌నగర్ విలేజి నం. 13 శివారులో నా భార్య గీతారాణి పేరున ఉన్న పట్టా సర్వే నం. 22/58లో 1.80 ఎకరాలు ముంపునకు గురైంది. ఈ సర్వే నంబరు పక్కన ఉన్న సుశీల్ మండల్‌కు పరిహారం చెల్లించారు. మాకు రాలేదు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. ఇటీవల కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్ వెళ్లగా అక్కడ జారి పడ్డాను. కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాను. జిల్లా అధికారులు న్యాయం చేయాలి. ముంపు బాధితురాలు గీతారాణి భర్త మనోరంజన్ మండల్

## అక్రమాలు పుట్టుకొస్తున్నాయి!

నిర్మల్ : రెండేళ్ల వయసు పూర్తయిన తమ కుమారుడికి జనన ధ్రువపత్రం కోసం తల్లిదండ్రులు ఇటీవల నిర్మల్ ప్రాంతంలో దరఖాస్తు చేసుకున్నారు. వారి ఆధార్‌కార్డు వివరాలను బట్టి తల్లిదండ్రులిద్దరూ ముథోల్ నియోజకవర్గానికి చెందినవారు.. లేట్ బర్త్ సర్టిఫికెట్ కావడంతో ముందుగా సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఈ దరఖాస్తును పరిశీలించి, వివరాలు నిర్ధారణ చేసుకొని ఆర్డీఓకు చేరవేయాలి. అక్కడ మరోసారి పరిశీలించి ప్రొసీడింగ్స్ జారీచేస్తారు. అయితే.. ఇక్కడ మాత్రం ఎలాంటి పరిశీలన జరగకుండా నిర్మల్ ప్రాంతవాసులే అన్నట్లు ఆర్డీఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం..

జనన ధ్రువపత్రం.. అప్పుడే పుట్టిన శిశువు నుంచి చదువుకునే విద్యార్థుల వరకు చాలా సందర్భాల్లో ఇదే అత్యంత కీలకం.. బడిలో చేరాలన్నా.. ఆధార్ పొందాలన్నా.. ఎక్కడైనా ఏ పథకంలోనైనా దరఖాస్తు సమర్పించాలన్నా ఇది తప్పనిసరి. సాధారణంగా మున్సిపల్, పంచాయతీ కార్యాలయాల పరిధిలో వీటిని జారీ చేస్తుంటారు. పుట్టిన బిడ్డకు ఏదైనా కారణాలతో ఏడాదిలోపు బర్త్ సర్టిఫికెట్ పొందలేకపోతే, నోటరీ ఇతర ధ్రువపత్రాలను జతచేస్తూ ఆర్డీఓ కార్యాలయం నుంచి ధ్రువపత్రం పొందాల్సి వస్తుంది. ఇప్పుడీ 'లేట్ బర్త్ సర్టిఫికెట్' వ్యవహారం అనేక అనుమానాలకు తావిస్తోంది.. ప్రక్రియంతా పకడ్బందీగా సాగాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. సరిగా పరిశీలించకుండా గుడ్డిగా ధ్రువీకరించి చేతులు దులుపుకొంటున్నట్లు అవగతమవుతోంది..

**జారీ ఇలా..**తల్లిదండ్రుల సొంతూరు ఏదైనప్పటికీ బిడ్డ జన్మించిన ఆసుపత్రుల నుంచి అక్కడి మున్సిపల్ కార్యాలయానికి తగిన సమాచారం అందజేస్తారు.. ఆ వివరాల ఆధారంగా, పుట్టిన బిడ్డకు పేరు ఖరారుచేసి, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి ఆధార్‌కార్డు జతచేసి మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేయాలి. వాటిని పరిశీలించి మున్సిపల్ నుంచి జనన ధ్రువపత్రం జారీచేస్తారు. ఒకవేళ ఇళ్ల వద్ద ప్రసవం జరిగితే అంగన్‌వాడీ కార్యకర్తలు ఆ విషయాన్ని నిర్ధారిస్తారు. వాటి ఆధారంగా పంచాయతీ, మున్సిపల్ కార్యాలయం నుంచి జనన ధ్రువపత్రం పొందవచ్చు. ఇదంతా బిడ్డ జన్మించిన ఏడాదిలోపైతేనే జరిగే ప్రక్రియ. అంతకన్నా ఎక్కువ సమయం దాటితే మాత్రం కాస్త క్లిష్టమవుతుంది. ఆలస్యంగా జనన ధ్రువపత్రం పొందే విషయంలో ఇప్పుడు అనుమానాలు తలెత్తుతున్నాయి. ముందుగా పంచాయతీ, మున్సిపల్‌లో జనన వివరాలు అందుబాటులో లేవని సర్టిఫికెట్ పొందాలి. దీంతో పాటు ఓ నోటరీని జతచేసి, తల్లి, తండ్రి ఆధార్‌కార్డులతో మీసేవా కేంద్రంలో దరఖాస్తు సమర్పించాలి.


దాన్ని సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి, ఆపై ఆర్డీఓకు అందిస్తారు. వారు ధ్రువీకరించిన తర్వాత వచ్చే ఉత్తర్వు ఆధారంగా జనన ధ్రువపత్రం జారీ అవుతుంది. దీనికోసం అధికారిక గడువు 90 రోజులు. ఇప్పుడిదే కొందరికి కాసులు కురిపిస్తోంది. కొందరు దళారీ అవతారం ఎత్తి కార్యాలయం, వినియోగదారుడికి మధ్య వారధిగా మారుతున్నారు. డబ్బులు తీసుకొని తక్కువ సమయంలోనే ధ్రువపత్రాలను అందిస్తున్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక



# దరిచేరని గృహజ్యోతి

హైదరాబాద్: నగరంలో గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చి 14 నెలలు అవుతోంది. రెండో ఏడాది వచ్చినా తమకు సున్నా బిల్లులు రావడం లేదని అర్హులు వాపోతున్నారు. తమకూ పథకం వర్తింపజేయాలని జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, కార్పొరేటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేసుకుని, ఆహార భద్రత కార్డు కలిగి ఉండి, 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగిస్తున్న వారికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. నగరంలో 55 లక్షలకు పైగా గృహ వినియోగదారులు ఉన్నారు. గృహజ్యోతి పథకం కోసం 20 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. జీహెచ్ఎంసీతోపాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో 10.50 లక్షల కుటుంబాలకే జీరో బిల్లులు వస్తున్నాయి.




**తమకు ఇంకెప్పుడు?:** దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న వారు తమకు ఎప్పటి నుంచి సున్నా బిల్లులు ఇస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. మిగతా 9.5 లక్షల మందిలో ఎంతమంది అర్హులు ఉన్నారో తేల్చి వర్తింపజేయాలని కోరుతున్నారు. పాతబస్తీకి చెందిన శ్రీనివాస్ ఉచిత విద్యుత్తు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆహార భద్రత కార్డు కూడా ఉంది. సిబ్బంది అలసత్వంతో ప్రజాపాలన పోర్టల్‌లో వీరి దరఖాస్తును నమోదు చేయకపోవటంతో పథకం వర్తించలేదు. శ్రీనివాస్ మాదిరే ఎంతో మంది దరఖాస్తు చేసుకున్నా.. అర్హత ఉన్నా.. గృహజ్యోతి లబ్ధికి నోచుకోలేదు. ఎల్బీనగర్‌కు చెందిన ప్రియాంకకు ఆహార భద్రత కార్డు ఉంది. నెలకు 150 యూనిట్లలోపే వినియోగిస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు అవకాశం లేకపోవటంతో ఏడాదికాలంగా ఆమె బిల్లు చెల్లిస్తూనే ఉన్నారు. ఇలాంటి వారంతా ఎదురుచూస్తున్నారు.

## నత్తనడకన సౌర విద్యుదుత్పత్తి పనులు

భగత్‌నగర్: ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సౌర విద్యుత్తు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆ సంస్థ సీఎండీ సంస్థ విద్యుత్తు పంపిణీతోనే సరిపెట్టకుండా ఉత్పత్తి దిశగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ఉమ్మడి జిల్లాలో సౌర విద్యుత్తు ఉత్పత్తికి ప్రణాళిక తయారు చేశారు. కరీంనగర్‌లోని హౌసింగ్ బోర్డులోని పోల్ సెంటర్‌లో రూ.4 కోట్ల వ్యయంతో 1.4 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంటుకు అనుమతులు జారీ చేశారు. దుర్శేడ్‌లో రూ.3.5 కోట్లతో 1 మెగావాట్, సిరిసిల్ల రాజన్న జిల్లాలోని బోయినిపల్లిలో రూ.6 కోట్లతో 2 మెగావాట్లు చేయడానికి నిర్ణయించారు. దీనిలో భాగంగా నగరంలోని హౌసింగ్‌బోర్డులోని పోల్ సెంటర్‌లో భూమిని చదును చేయించి



రూ.28 లక్షలతో ప్రహరీ నిర్మించారు. ఈ ప్రహరీకి గేట్లు బిగించాల్సి ఉంది. ఈ ప్రాంతంలో సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఫిబ్రవరిలోనే అనుమతులు మంజూరు చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా పనుల ప్రగతి కనిపించడం లేదు. ఈ విషయంపై ఎస్ఈ రమేశ్‌బాబును సంప్రదించగా పనులన్నీ వరంగల్‌లోని కార్పొరేట్ కార్యాలయం పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు.

## గూడు గోడు పట్టించుకోరా!

నల్గొండ : పేదల సొంతింటి కల నెరవేర్చాలని గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదుల గృహాలు నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పాండవుల గుట్ట సమీపంలో సుమారు రూ.14 కోట్లతో 2017-18లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 2022 నాటికీ 280 ఇళ్లను నిర్మించారు. పనులు పూర్తయినా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. మొదటి విడతలో 50 మందిని ఎంపిక చేసి వదిలేశారు. రెండో విడతలో మండలంలోని గ్రామాల వారీగా 180 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు పంపిణీ చేయాలని కార్యాచరణ రూపొందించినా కార్యక్రమం వాయిదా పడింది. ఈ ఇళ్ల కోసం పేదలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఏళ్ల కిందట నిర్మించడం, వాడకపోవడంతో గృహాల పరిసరాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి.

**కనిపించని మౌలిక వసతులు**

రెండు పడక గదుల ఇళ్లు నిర్మించిన గుత్తేదారులు రోడ్లు, మరుగుదొడ్లకు సెప్టిక్ ట్యాంకు, తాగునీటి వసతి, వీధి దీపాలు, విద్యుత్తు, మురుగు కాలువలు తదితర వసతులు కల్పించలేదు. రాత్రి వేళల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని పలువురు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా రెండు పడక గదుల ఇళ్లవైపు కన్నెత్తి చూడటం లేదని పేదలు వాపోతున్నారు. **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

-జగదీశ్వర్‌రావు, తహసీల్దార్, కాల్వశ్రీరాంపూర్

రెండు పడకల గదుల ఇళ్ల పంపిణీ ప్రతి పాదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. చాలా మంది దరఖాస్తులు అందించారు. రెండు పడక గదుల ఇళ్లలో మౌళిక వసతులు కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన నిరుపేదలకు అందేలా చూస్తాం.

# గమ్యం.. గందరగోళం




హైదరాబాద్: సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రయాణ ప్రయాస తప్పించేందుకు చేసిన ప్రయత్నమే 'టీజీఎస్ ఆర్టీసీ గమ్యం ట్రాకింగ్ యాప్'..బస్సుల రాకపోకలు లైవ్ ట్రాకింగ్ ద్వారా ప్రయాణికుల విలువైన సమయాన్ని ఆదా చేయాల్సిన ఈ యాప్ మరింత ప్రయాసను పెంచుతోంది. సాంకేతిక లోపాలు ప్రయాణికులను బస్టాపుల్లో పడిగాపులు పడేలా చేస్తున్నాయి. లేని సర్వీసులు ఉన్నట్టు, ఉన్న సర్వీసులు లేనట్టు చూపుతుండటంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. యాప్‌లో పేర్కొన్న బస్సులకు నడిచే వాటికి పొంతన ఉండటం లేదంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తుండటం గమనార్హం. గమ్యం యాప్ పనితీరుపై రోజుకు 10 నుంచి 15 ఫిర్యాదులు నమోదవుతుండటం గమనార్హం. 10 లక్షల మందికి పైగా ఆర్టీసీ ప్రయాణికులు గమ్యం యాప్‌ను వినియోగిస్తుండగా అందులో సింహభాగం గ్రేటర్‌వాసులే ఉన్నారు. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు యాప్‌ను వినియోగిస్తున్నారు. లైవ్ ట్రాకింగ్ సదుపాయంతో సమయానికి బస్‌షెల్టర్‌కు వెళ్లాలనుకున్నవారికి చుక్కలు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోంది.

**ఉదంతాలు...**

సరూర్‌నగర్ నుంచి మెహదీపట్నం (156ఎస్) మార్గంలో ప్రతి ఎనిమిది నుంచి 10 నిమిషాలకో బస్సు అందుబాటులో ఉంటుందని యాప్‌లో చూసి బస్‌స్టాప్‌కు వెళ్లగా సుమారు గంటసేపు చైతన్యపురి బస్టాప్‌లో వేచి ఉండాల్సి వచ్చిందంటూ సద్గుణాచారి అనే ప్రయాణికుడు వాపోయారు. బస్ ట్రాకింగ్‌లోనూ అనేక సాంకేతిక లోపాలు కనిపిస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి నాంపల్లి మార్గంలో వెళ్తున్న బస్సు సోమాజిగూడ వద్ద ఉంటే బేగంపేట్ వద్ద ఉందని చూపిస్తుందని, సికింద్రాబాద్ నుంచి సరూర్‌నగర్ మార్గంలో నడిచే బస్సుల లైవ్ ట్రాకింగ్ అప్పుడప్పుడూ కనిపించడం లేదని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు.

ఐఐటీ హైదరాబాద్ నుంచి మెహదీపట్నం వరకు ఏసీ బస్సులు నడపడం లేదు. అయితే సీబీఎస్ - పటాన్‌చెరు (217 మార్గం)లో ఏసీ బస్సులు ఉన్నట్టు చూపిస్తోందని, కోఠి నుంచి పటాన్‌చెరు మార్గంలో ఏసీ బస్సును ఎందుకు రద్దు చేశారో కూడా చెప్పడం లేదని ప్రయాణికులు వాపోయారు.

# త్వరలోనే కొత్త మాస్టర్ ప్లాన్



కరీంనగర్ : కరీంనగర్ శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా), నగర పాలక సంస్థ పరిధిలో కొత్త మాస్టర్‌ప్లాన్ త్వరలోనే అమలు కానుంది. 2041 విజన్‌తో తయారు చేసిన ముసాయిదా బృహత్ ప్రణాళికను మూడు నెలల కిందట ప్రకటన జారీ చేశారు. మాస్టర్‌ప్లాన్‌పై ఆసక్తి గల వారు సలహాలు, అభ్యంతరాలను రాతపూర్వకంగా 90 రోజుల్లో అందించాలని కోరారు. స్వీకరణ గడువు జూన్ 28తో ముగిసింది. నగరంలో 20 ఏళ్లకు ఒకసారి మాస్టర్‌ప్లాన్ తయారు చేయాల్సి ఉండగా ఆరేళ్లుగా కొలిక్కి రావడంలేదు. మున్సిపాలిటీగా ఉన్న సమయంలో విలీనం చేసిన రాంపూర్, రాంనగర్ పంచాయతీలు, అయిదేళ్ల కిందట ఎనిమిది గ్రామాలు, ప్రస్తుతం అయిదు గ్రామాలు, ఒక మున్సిపాలిటీ విలీనం చేశారు. సుడా విస్తరించడంతో సరిహద్దులు మారాయి.

**వాణిజ్య, మిక్స్‌డ్ జోన్**

నగరంలో ప్రధాన రహదారుల వెంట ఉన్న వాణిజ్య, మిక్స్‌డ్ రోడ్లుగా ప్రణాళికలు చేశారు.

విలీన గ్రామాల్లోని వ్యవసాయ భూములను సులువుగా నివాసత ప్రాంతాలుగా మార్చుకునే వీలు కల్పించారు.

40 ఫీట్ల పైబడిన వాటన్నింటికి మిక్స్‌డ్ ల్యాండ్ కింద చూపించారు.

అలకాపురి, బ్యాంకుకాలనీలో వంద పీట్ల రహదారిగా చూపించారు.

ప్రస్తుతం 30 నుంచి 60 ఫీట్లకు మార్చనున్నారు.

ప్రధాన రహదారులకు ఇరువైపులా, టవర్‌సర్కిల్ ప్రాంతాన్ని వాణిజ్య జోన్‌గా గుర్తించనున్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లుగా సూచిస్తుండగా ప్రస్తుతం నివాసిత ప్రాంతాలుగా ఉన్నాయి. వీటికి భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేలా మార్పులు చేశారు.

**30కి పైగా అభ్యంతరాలు**

బృహత్తర ప్రణాళికపై 30కిపైగా సుడా కార్యాలయానికి అభ్యంతరాలు వచ్చాయి.

వీటన్నింటిని సుడా కార్యాలయంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి న్యాయబద్ధంగా ఉన్న వాటిని వారం రోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

సాంకేతికపరంగా పరిష్కారం అయినా, కాకపోయినా ఫిర్యాదుదారులకు మళ్లీ సమాధానం ఇస్తారు.

అనంతరం ప్రభుత్వానికి పంపిస్తారు. అక్కడ ఆమోదం తెలిపితే మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు.

వీటిలో స్థల మార్పిడి, ఔటర్ రింగ్ రోడ్డులో వ్యవసాయ భూములు వెళ్తున్నాయని, ఈ సర్వే నంబర్ల నుంచి తప్పించాలనే అంశాలపై ఎక్కువగా అభ్యంతరాలు వచ్చినట్లు సమాచారం.

జనాభాకు తగ్గట్లుగా రవాణా సౌకర్యం మెరుగు పర్చేందుకు ఔటర్ రింగ్ రోడ్డు 200 ఫీట్ల వెడల్పు, 138 కిలోమీటర్ల పొడవునా నిర్మించాలని నిర్ణయించారు.

గన్నేరువరం, గునుకుల కొండాపూర్ జంగపల్లి ఖాసీంపేట్, మాదాపూర్, పారువెల్ల, ఒద్యారం, బొమ్మకల్, దుర్శేడ్, ఎలబోతారం, ఇరుకుల్ల, ఖాజీపూర్, నాగుల మల్యాల, నగునూర్, కొత్తపల్లి(హెచ్), అన్నారం, మానకొండూర్, ముంజంపల్లి, కొక్కరకుంట, వన్నారం, వెదిర, వెలిచాల, మన్నెపల్లి, పొరండ్ల, తిమ్మాపూర్, నుస్తులాపూర్ మీదుగా రింగు రోడ్డుకు ప్రతిపాదించారు.

# ఏటా ముప్పు.. కానరాని శాశ్వత చర్యలు



కోరుట్ల : ప్రకాశంరోడ్, ఆదర్శనగర్, ముత్యాలవాడ, రవీంద్రరోడ్, అయిలాపూర్‌రోడ్, ఝాన్సీరోడ్‌లోని లోతట్టు ప్రాంతాలు ఏటా వరద ముంపునకు గురవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వర్షం నీరు సాఫీగా వెళ్లేందుకు అనువుగా కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే వరద పారుతోంది. కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు వర్షాకాలంలో కంటిమీద కునుకులేకుండా పోతోంది. కొన్నేళ్లుగా పట్టణంలోని లోతట్టు కాలనీలు, ప్రాంతాలను వరదలు ముంచెత్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం మధ్యలో ఉన్న మద్దుల చెరువు, తాళ్ల చెరువు, కంచరకుంటలు ఏటా పొంగి ప్రవహిస్తుంటాయి. మురుగు కాలువలు నిండి రోడ్డుపై నీరు ప్రవహించడంతో వరదలు సంభవిస్తున్నాయి. వానాకాలం రావడంతో ఆయా కాలనీల ప్రజల్లో వణుకు మొదలైంది. కాలనీలు, ఇళ్ల చుట్టూ వరద నీరు భారీగా ప్రవహించడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోనే కోరుట్ల రెండో అతిపెద్ద పట్టణం. ఏటా పలుకాలనీలు జలమయమవడం, చెరువు మత్తడి కాలువలు ఆక్రమణకు గురికావడం, కాలువలను రోడ్డుగా నిర్మించడం, చెరువు కాలువలను మురుగు కాలువలుగా మార్చడం ఇందుకు కారణం. పట్టణం నాలుగు దిక్కులా విస్తరిస్తూ చాలా కాలనీలు వెలిశాయి. పెరుగుతున్న కాలనీలు, ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా రోడ్ల విస్తరణ చేపట్టకపోవడం, మురుగు కాలువలు నిర్మించడంలో అధికారులు విఫలమవుతున్నారు. వర్షపు నీరు రోడ్లపైకి చేరి రోజుల తరబడి ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షానికే కాలనీల రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది.

**చెరువు కాలువలు కనుమరుగు**

మద్దుల చెరువు మత్తడి కిందున్న మద్దడి కాలువ 10-15 అడుగులతో ఉండగా అక్రమ లేఅవుట్ల కారణంగా ఆక్రమణకు గురై కేవలం 3-4 అడుగుల మురుగు కాలువగా మార్చారు. కాలువను పూడ్చి సీసీరోడ్డు, భవనాలను నిర్మించారు. తాళ్ల చెరువు మత్తడి కిందున్న కాలువను పూర్తిగా పూడ్చివేసి సిమెంట్‌రోడ్ ఏర్పాటు చేయగా, రోడ్డు పక్కన కేవలం 3 అడుగుల మేర మురుగు కాలువగా నిర్మించారు. పలుచోట్ల కాలువ భూమిని ఆక్రమంచి ఇళ్లు నిర్మించారు. కంచరకుంట మత్తడి కిందున్న కాలువ పూర్తిగా కనుమరుగైంది. మత్తడి దూకిన నీరు వెళ్లే మార్గం లేకపోయింది. దీంతో ఏటా చెరువు నిండిన తర్వాత మత్తడి దూకడంతో వచ్చే వరద నీరు కాలనీలను ముంచెత్తుతున్నాయి.

**ప్రతిపాదనలు పంపించాం- సురేశ్, పురపాలక డీఈఈ**

పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వరదలు సంభవించకుండా మద్దుల చెరువు కింద, ఆదర్శనగర్, దేశాయినగర్ ప్రాంతాల్లో ప్రత్యేక కాలువలు నిర్మించేలా ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే ప్రత్యేక కాలువ నిర్మాణం చేపడతాం. ప్రస్తుతం వర్షపు నీరు రోడ్లపై ప్రవహించకుండా సజావుగా వెళ్లేందుకు పట్టణంలోని పెద్ద మురుగు కాలువలను శుభ్రం చేయించాం.

# అరకొర మాఫీపై ఆందోళన

జగిత్యాల : రుణమాఫీ నిధులందలేదని మల్లాపూర్ మండలం మొగిలిపేటకు చెందిన 296 మందికిపైగా రైతులు తమ పేర్లతో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి నిరసన తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి చాలా గ్రామాల రైతులు తరలివచ్చి మాఫీ నిధులివ్వాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ రుణమాఫీగాని రైతులు పెద్దఎత్తున ఉండగా తమకూ మాఫీ నిధులందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పంటరుణమాఫీలో నిధులందక వేలాదిమంది జిల్లారైతులు ఆందోళన చెందుతున్నారు. 12.12.2018 నుంచి



9.12.2023 తేదీల్లో తీసుకున్న పంటరుణాలు, రెన్యూవల్స్ రుణాలను, రూరల్ బ్యాంకుల్లోని సాగు బంగారురుణాలను పరిగణనలోకి తీసుకొని పంటరుణాల మాఫీ ప్రక్రియ చేపట్టింది. ఈ కటాఫ్‌తేదీ ప్రకారం జిల్లాలో మొత్తం 1,43,274 మంది రైతులు అర్హులుగా తేలగా నాలుగు విడతల్లో కలిపి 80,546 మందికి రూ.721.74 కోట్ల నిధులు విడుదల చేశారు. రూ.2 లక్షలలోపు రుణాలతో పాటు రూ.2 లక్షలకు పైబడి మొత్తం 62,728 మంది రైతులు ఇంకా రుణమాఫీ నిధులకు పడిగాపులు పడుతున్నారు. భర్త విదేశాలకు వెళ్లినవారిలో భార్యపేరిట రుణంఇవ్వగా ధరణి పోర్టల్‌లో భార్యపేరిట భూమి వివరాలు ఉండవుకాబట్టి వీరి సమస్యను పరిష్కరించాల్సిఉంది. మైనర్ రుణాలు, కుటుంబసభ్యుల నిర్ధారణ జరగాల్సినవి, ఇతరత్రా సమస్యలను పరిష్కరించి నిధులు విడుదల చేయాల్సిఉంది. రూ.2 లక్షలకు పైబడిన మొత్తాన్ని చెల్లిస్తే రూ.2 లక్షలు ఇస్తామని గతంలో పేర్కొనగా ప్రస్తుతం ఈ అంశం ఊసేలేదు. కుటుంబాన్ని కలిపి లెక్కిస్తే రూ.2 లక్షలు దాటిందని, రూ.2 లక్షల్లోపు రుణమున్న తమకు కుటుంబంలో కనీసం ఒకరికైనా నిధులు మంజూరివ్వాలని వేలాదిమంది రైతులు కోరుతున్నారు. గత భారాస ప్రభుత్వ హయాంలోనూ రూ.లక్షకు పైబడి పంటరుణంగల జిల్లాకు చెందిన 35 వేలమందికి నిధులు రాకముందే శాసనసభ సాధారణ ఎన్నికలువచ్చి నిధులవిడుదల ఆగిపోయింది. కనీసం ప్రస్తుత ప్రభుత్వమైనా తమకు పూర్తిస్థాయిలో పంటరుణాన్ని మాఫీచేయాలని రైతులు కోరుతున్నారు.

# నేనంటే..నేనే..!

నల్గొండ : ట్రాన్స్‌కోలో కుర్చీలాట చోటు చేసుకుంది. ఒక కుర్చీ కోసం ఇద్దరు అధికారులు పోటీ పడుతున్నారు. దీంతో విద్యుత్తుశాఖలో కార్యకలాపాలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు కలిపి నల్గొండలో ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. దాని పరిధిలో 132 కేవీ విద్యుత్తు కేంద్రాలతో పాటు ఆపై సామర్థ్యం ఉన్న సబ్‌స్టేషన్ల నిర్వహణ, హెచ్‌టీ లైన్ల నిర్వహణ పూర్తిగా పర్యవేక్షిస్తారు. ఇందులో కీలమైన ఎస్ఈ పోస్టు భర్తీపై గత కొన్నాళ్లుగా గందరగోళం నెలకొంది. పది నెలలుగా అనిశ్చితి నెలకొనడంతో ట్రాన్స్‌కో సేవల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వశాఖలో లేని విధంగా ట్రాన్స్‌కోలో ఒకే కుర్చీలో ఇద్దరు ఎస్ఈలుగా విధులు నిర్వహిస్తున్న వ్యవహారం నల్గొండలో కొనసాగుతోంది. ట్రాన్స్‌కోలో డీఈగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు 2022లో పీహెచ్‌సీ కోటాలో ఎస్ఈగా ఉద్యోగోన్నతి కల్పించి నల్గొండలోనే ఎస్ఈగా బాధ్యతలు అప్పగించారు. ఆ ఉద్యోగోన్నతుల్లో పొరపాటు చోటుచేసుకున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించి తిరిగి 2024 ఆగస్టులో ఆ ఉద్యోగోన్నతి రద్దు చేశారు. ఆ సమయంలో ట్రాన్స్‌కో ఎస్ఈగా కె.నారాయణరెడ్డిని ఉద్యోగోన్నతిపై నల్గొండకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన విధుల్లో చేరినప్పటికి మరోపక్క ఉద్యోగోన్నతి రద్దు అయిన డీఈ హరిప్రసాద్ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని ఎస్ఈగా యథాస్థానంలో కొనసాగుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఎస్ఈగా నియమించిన నారాయణరెడ్డి సీటులో ఉండి విధులు నిర్వహించాల్సినప్పటికీ పక్క గదిలో కూర్చొని వెళ్లిపోతున్నారు.

**ఉద్యోగుల బది'లీలలు'**

ట్రాన్స్‌కోలో అధికారుల లీలలు చెప్పనవసరం లేదు. ఉద్యోగుల



బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతుంది. బదిలీలు బ్యాన్ ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా 30 మందికి పైగా వర్క్‌ఆన్‌డ్యూటీ పేరుతో ఆర్టిజన్లు, జేఎల్ఎం బదిలీలు నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. వాటి వెనుక పెద్ద మొత్తంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. చేయి తడిపితే కోరుకున్న చోటుకు ఉత్తర్వులు ఇస్తున్నాట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**అవినీతి లేదు: హరిప్రసాద్, ఎస్ఈ ట్రాన్స్‌కో**

ఉద్యోగులు పదవీ విరమణతో ఖాళీ అయిన స్థానంలో ఇతరులకు బాధ్యతలు అప్పగిస్తాం. వర్క్‌ఆన్‌డ్యూటీ పేరుతో బదిలీ చేస్తాం. కానీ అవినీతి జరగడం లేదు. ఎస్ఈగా ఉద్యోగోన్నతి లభించినా పొరపాటు జరిగిందని దాన్ని రద్దు చేశారు. తిరిగి కోర్టు ద్వారా స్టే తెచ్చుకున్నా. బదిలీపై వచ్చిన నారాయణరెడ్డికి మరో స్థానం కేటాయించాల్సి ఉంది. కానీ దీనిపై అధికారులు నిర్ణయం తీసుకోలేదు.




పాశమైలారం: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ప్రమాదంపై సిగాచీ పరిశ్రమ ప్రకటన విడుదల చేసింది. పేలుడు కారణంగా 40 మంది మృతి చెందినట్లు పేర్కొంది. మరో 33 మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించింది. గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. కార్మికులకు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తామంది. క్షతగాత్రుల వైద్య ఖర్చులు భరిస్తామని.. వారి కుటుంబ పోషణ చూస్తామని పేర్కొంది. సిగాచీ తరఫున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రమాదంపై స్టాక్‌మార్కెట్లకు ఆయన లేఖ రాశారు. ఈ ఘటనకు రియాక్టర్ పేలుడు కారణం కాదని తెలిపారు. ప్రభుత్వ విచారణ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. 3 నెలల వరకు ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివేక్ కుమార్ పేర్కొన్నారు.

**పటాన్‌చెరు ఆసుపత్రికి వచ్చిన సిగాచీ డైరెక్టర్...** పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి సిగాచీ డైరెక్టర్ చిదంబరం వచ్చారు. సిగాచీ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ మృతదేహం తీసుకెళ్లేందుకు ఆయన వచ్చారు.

## పాశమైలారం ఘటన.. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు: మంత్రి దామోదర

పాశమైలారం: పాశమైలారంలోని పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇప్పటివరకు 36 మంది మరణించారని.. ఇంకా 11 మంది కార్మికుల ఆచూకీ దొరకడం లేదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పేలుడు సంభవించిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆచూకీ గల్లంతైనవారు బతికే అవకాశాలు తక్కువని పేర్కొన్నారు. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు జరుగుతున్నాయని వివరించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. సిగాచీ కంపెనీ యాజమాన్యం ప్రమాద స్థలికి వచ్చిందని.. వారితో చర్చించినట్లు దామోదర రాజనర్సింహ తెలిపారు. సిగాచీ పరిశ్రమను మంత్రితో పాటు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేత జగ్గారెడ్డి తదితరులు పరిశీలించారు. విపత్తు నిర్వహణ సిబ్బందిని



అడిగి ప్రమాదం తెలుసుకున్నారు. బాధితుల బంధువులను పరామర్శించి అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.




## విద్యార్థి వీసాలకూ 'టైం లిమిట్'.. అమెరికా కొత్త మెలిక..!

అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న, అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థి వీసాలకూ పరిమిత కాల గడువు విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. దీంతో విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు పట్టుకుంది. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాలనుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ విభాగం సిద్ధమైంది. విద్యార్థి వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది. అంటే, ఇకపై విద్యార్థి వీసాలకు కూడా టైం లిమిట్ విధించనున్నారు. దీంతో గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలను సమీక్షించేందుకు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ విభాగానికి పంపించారు. అనంతరం దీన్ని ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేస్తారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రతిపాదనలపై న్యాయనిపుణులు, విద్యార్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్పుల వల్ల విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, అనవసరపు గందరగోళానికి దారితీస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు.

## రేవంత్‌రెడ్డి.. తెలంగాణకు మరణశాసనం రాశాడు.. హరీష్‌రావు ఫైర్




హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు తాము రెడీ.. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. ఇవాళ (బుధవారం) తెలంగాణభవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్ధాల వైరస్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ .. హైదరాబాద్‌లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు. ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్ట్‌లను అడ్డుకున్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అహంకారంతో మాట్లాడితే.. రేవంత్‌ను ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఇంకా మర్చిపోలేకపోతున్నారని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. బీఆర్ఎస్ హయాంలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మాజీ మంత్రి హరీష్‌రావు క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డే సతీసమేతంగా ఉత్తమ్‌ను విజయవాడ పంపించారని ఆరోపించారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా గెలవలేదని.. అంతమాత్రాన ఆ పార్టీ చచ్చిన పాము అవుతుందా అని ప్రశ్నించారు. చచ్చిన పాము ముచ్చట్లు రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం కాకుండా.. రాజకీయ ప్రయోజనాల కోసమే రేవంత్ మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.




దిల్లీ: కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు వారు కూడా కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పోతుండటం కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు దీనిపై పరిశోధనలు చేపట్టి కీలక విషయాలు వెల్లడించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని తమ అధ్యయనాల్లో తేలినట్లు స్పష్టం చేశాయి. మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమే ఆయా వ్యక్తుల మరణాల్లో కీలక అంశమని పేర్కొన్నాయి.

ఈమేరకు అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. 18-45 ఏళ్ల వయసు వారిలో ఆకస్మిక మరణాలు సంభవించడంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), ఎయిమ్స్ పరిశోధనలు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కన్పించినప్పటికీ 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య ఉన్నట్టుండి మరణించిన వారి డేటాను పరిశీలించాయి.

వీటిని అధ్యయనం చేసిన తర్వాత.. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. "భారత్‌లో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితం, సమర్థవంతమైనవి. వీటివల్ల దుష్ప్రభావాలు చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కన్పించాయి. గుండె సంబంధిత ఆకస్మిక మరణాలకు అనేక కారణాలు ఉన్నాయి. జన్యుపరమైన సమస్యలు, జీవన శైలి, మునుపటి అనారోగ్యాలు.. ఇలా ఏవైనా కావొచ్చు" అని అధ్యయనాల్లో తెలిపాయి. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవేనని పునరుద్ఘాటించాయి. ఆధారాల్లేకుండా చేసే ఇలాంటి ప్రచారాలు వ్యాక్సిన్లపై విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ టీకాల వల్లే ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని గుర్తుచేశాయి.

## రిజర్వేషన్లు అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

ఖమ్మం, జులై 02: 40 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్లు ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం - బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక



సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులోభాగంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు.

## తాలిపేరు ప్రాజెక్టుకు జలకళ

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండటంతో జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌తో పాటు, తెలంగాణలో కురుస్తున్న తేలికపాటి వర్షాలకు జలాశయానికి బుధవారం వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్వహణ పనులను అధికారులు పూర్తి చేశారు. నిర్వహణ పనుల్లో భాగంగా ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లను పూర్తిగా తెరిచి ఉంచారు. దీంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షంతో వరద నీరు జలాశయానికి భారీగా వస్తోంది. ప్రాజెక్ట్ స్పిల్‌వే నుంచి వరద నీరు జాలువారుతూ దిగువ గోదావరికి పరుగులు తీస్తోంది. మొన్నటి వరకు నీళ్లు లేక వెలవెలబోయిన జలాశయం వరద నీటితో కళకళ లాడుతోంది. త్వరలో ప్రాజెక్ట్ గేట్లను దించివేస్తామని ఏఈఈ సంపత్ తెలిపారు.





## బీవీ పట్టాభిరామ్‌కు ప్రముఖుల నివాళి

పంజాగుట్ట: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్(75) మంగళవారం గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు బంజారాహిల్స్ ఒమేగా ఆసుపత్రి నుంచి ఖైరతాబాద్ ఆనంద్ నగర్‌లోని నివాసానికి తీసుకువచ్చారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవై సోమయాజులు, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, రామకృష్ణ మఠ్‌కు చెందిన సుఖబోధానంద, పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు.

## సినిమాను తలపించే బ్యాంకు దోపిడి.. చిన్న తప్పుతో..

కర్ణాటకలోని విజయ్‌పూర్ జిల్లాలో బ్యాంకు దోపిడీ జరిగింది. దొంగలు బ్యాంకు లాకర్‌లోని బంగారాన్ని ఎత్తుకెళ్లిపోయారు. బంగారం దొంగిలించిన లాకర్‌లో ఓ బొమ్మ పెట్టి వెళ్లారు. దొంగలు ఎత్తుకెళ్లిన ఆ బంగారం విలువ 53 కోట్ల రూపాయలు కావటంతో.. పోలీసులు కేసును సవాల్‌గా తీసుకున్నారు. దర్యాప్తు మొదలెట్టారు. అయితే, దొంగతనానికి కారణం అయిన వ్యక్తి.. పోలీసులు ఊహించిన దానికంటే ఈజీగా దొరికిపోయాడు. కేసు సాల్వ్ అయింది. ఇంతకీ లాకర్‌లో ఉంచిన బొమ్మకు దొంగతనానికి ఏంటి సంబంధం?.. పోలీసులు దొంగల్ని ఎలా పట్టుకున్నారు?... 2025, మే 25.. విజయ్‌పూర్ జిల్లా మనగొలిలోని కెనరా బ్యాంకులో దొంగతనం జరిగింది. దొంగలు బ్యాంకు లాకర్‌లోంచి 53 కోట్ల రూపాయలు విలువ చేసే బంగారాన్ని దోచుకెళ్లారు. అంతేకాదు.. బంగారం దోచిన లాకర్‌లో క్షుద్రపూజలు చేసే బొమ్మను ఉంచి వెళ్లారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే, ఆ దొంగతనానికి.. లాకర్‌లో ఉంచిన బొమ్మకు సంబంధం ఏంటన్నది పోలీసులకు అర్థం కాలేదు. దొంగతనం జరిగిన రోజు బ్యాంకు చుట్టు పక్కల ఉన్న అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను తెప్పించుకున్నారు. వాటిని పరీక్షించారు. దొంగతనం జరిగిన రోజు ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దొంగతనం జరగడానికి ముందు.. దొంగతనం జరిగిన తర్వాత బ్యాంకు దగ్గర ఆ కారు తిరుగుతూ కనిపించింది. పోలీసులు ఆ కారు యజమాని వివరాలు కనుక్కున్నారు. ఆ కారు విజయ్ కుమార్ మిరియాలకు చెందిందిగా తేలింది. అతడి గురించి పూర్తి వివరాలు కనుక్కోగా అసలు విషయం బయటపడింది. మే 8వ తేదీ వరకు అతడు అదే బ్యాంకులో మేనేజర్‌గా పని చేశాడు. మే 9వ తేదీన వేరే బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. వేరే బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయిన వ్యక్తికి దొంగతనం జరిగిన రోజు ఆ బ్యాంకు దగ్గర పనేముందని పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనం తానే చేయించినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు అతడితో పాటు దొంగతనానికి పాల్పడ్డ మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 10 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. లాకర్‌లో పెట్టిన బొమ్మ గురించి ఆరా తీయగా.. కేసును తప్పుదోవ పట్టించడానికి అలా చేసినట్లు చెప్పారు.




PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 îEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660